సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 26 । మార్చి । 2025



సోమశిలలో 54.086 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 54.086 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.90,630
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,202
3శాతం జీఎస్టీతో	రూ.8,448
నవర (8గ్రా)	రూ.67,584

గరిష్టం/కనిష్టం
35.1 /26.0

వాతావరణం

బుధవారం జిల్లాలో వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 63 శాతంగా నమోదైంది.



న్యూస్‌రీల్

28లోపు సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీల పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28వ తేదీ లోపు డీఈఓ కార్యాలయంలో తెలియజేయాలని డీఈఓ బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్, నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పేరు, హోదా, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ జరిగిందో సంబంధిత ఆధారాలతో చూపించాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ పూర్తి అదనపు బాధ్యతల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాలసాని శ్రీనివాసులు మంగళవారం దర్గామిట్టలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసులు, ఏపీఎం ఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ పథకాలను లబ్ధిదారులకు సత్వరమే చేరవేసేందుకు కృషి చేస్తామన్నారు. పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులు వినియోగించుకునేలా చేస్తామన్నారు.

ఐసీడీఎస్ పీడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నిర్మలారెడ్డి

నెల్లూరు (పొగతోట): ఐసీడీఎస్ పీడీ (ఎఫ్‌ఏసీ)గా నిర్మలారెడ్డిని నియమించారు. ఆమె మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నిర్మలారెడ్డి ప్రస్తుతం బీసీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెను ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మూగజీవాలపై దూసుకెళ్లిన భారీ వాహనం

- 11 గొర్రెలు మృతి, కాపరులకు తీవ్రగాయాలు



వాహనం ఢీకొనడంతో మృతి చెందిన గొర్రెలు

మర్రిపాడు: మండలంలోని పొంగూరు కండ్రిక సమీపంలో అచ్చమాంబ ఆలయ సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై మంగళవారం ఓ గొర్రెల మందపైకి ఓ భారీ వాహనం దూసుకెళ్లింది. మేత కోసం ఇర్లపాడు నుంచి వెంగంపల్లి సిరివెళ్ల గ్రామానికి తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల కాపరి నాగయ్యకు తీవ్రగాయాలు కాగా సన్ను రమణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్ ద్వారా ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీపల్లిలో 461 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 461 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 503 బేళ్లు రాగా 461 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260 లభించింది. సగటు ధర రూ.278.17 నమోదైంది. వేలంలో 61,006 కిలోల పొగాకును విక్రయించగా రూ.169,70,309 వ్యాపారం జరిగింది. వేలంలో 8 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

- దశాబ్దాలుగా ఇప్పటికీ కూలీలుగానే..
- గత ప్రభుత్వంలో వ్యాపారులుగా రాణించిన మహిళలు
- డ్వాక్రా సంఘాలతో సూపర్ మార్ట్‌ల ఏర్పాటు
- కూటమి ప్రభుత్వం రాగానే కుప్ప కూల్చేసిన వైనం
- రుణాలు లేవు.. ఆర్థిక సాయం లేదు.. పారిశ్రామికవేత్తలు ఎలా..!

పారిశ్రామికవేత్త ఎప్పుడవుతావు పొదుపు చెల్లెమ్మా!

డ్వాక్రా మహిళల జీవనోపాధి లక్ష్యం ఆమడ దూరం



ఈ ఫొటోలో ఉన్న పొదుపు మహిళ పేరు దేగా శాంతమ్మ. కావలి మండలం చలంచర్ల పంచాయతీ పెద్దారం గ్రామం. డ్వాక్రా సంఘాల్లో 15 ఏళ్లుగా సభ్యురాలుగా ఉంది. జీవనోపాధి కోసం కూలి పనులు చేసుకుంటోంది. తమ గ్రామానికి 10 కి.మీ. దూరంలో ఉన్న కొత్తపల్లి గ్రామానికి వచ్చి కూలి పనులు చేస్తోంది.



ఈ ఫొటోలో ఉన్న మహిళ ఆదెమ్మ. ఈమె శ్రీకాకుళం జిల్లా పలాస పట్టణం నుంచి కావలి పట్టణానికి వచ్చి రోడ్డు మార్జిన్‌లో కూర్చొని జీడిపప్పు అమ్మకాలు చేస్తోంది. పలాసలోని జీడిపప్పు వ్యాపారులు ఆమెకు రోజుకు రూ.150 కూలి ఇస్తారు. గడిచిన 20 ఏళ్ల నుంచి ఈమె పొదుపు సంఘాల్లో సభ్యురాలిగా ఉంది. కానీ జీవనోపాధి కోసం సొంతూరు నుంచి 700 కి.మీ. దూరంలో ఉన్న కావలికి వచ్చి కూలి పని చేస్తోంది.



ఈ మహిళ పేరు కాకు పద్మమ్మ. కావలి మండలం పెద్దారం గ్రామం. పొదుపు గ్రూపులో 15 ఏళ్ల నుంచి ఉంటోంది. కుటుంబ జీవనం కోసం కూలి పనులు చేస్తోంది. పొదుపు గ్రూపు ద్వారా ఈమెకు జీవనోపాధి సమకూరలేదు.




కూలీలుగా మట్టి పనులు చేస్తున్న పొదుపు మహిళలు

కావలి:

"పొదుపు చేయడంలో మహిళలే మహారాణులు. పొదుపు అనే ఆర్థిక ఉద్యమంలో పేద మహిళలు చైతన్య వంతులైతే వారు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. పొదుపు మహిళలను తమ ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తాం."

– ఇటీవల డీఆర్‌డీఏ పీడీల సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలివి.

ఇలాంటి మాటలు వినడానికి బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూతనందించడానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రాష్ట్రంలో డ్వాక్రా గ్రూపుల సృష్టికి తానే ఆద్యుడనని చెప్పుకునే సీఎం చంద్రబాబు ఆ డ్వాక్రా మహిళల ఎదుగుదలకు ప్రణాళికాబద్ధంగా ఏనాడు చిత్తశుద్ధిగా వ్యవహరించడలేదు. వీరిని దాదాపు 30 ఏళ్లుగా తన ప్రచార సభల్లో జనసమీకరణకు వాడుకున్నారే తప్ప.. వారి అభివృద్ధికి పాటుపడిన చరిత్ర లేదు. పొదుపు మహిళలకు అరకొరగా రుణాలిచ్చి.. వాటిని ఇంటి ఖర్చులకు వాడుకునేలా చేస్తూ.. జీవితాంతం అప్పులు తీర్చుకునే విధంగా వారిని ఆ చట్రంలో బిగించారు. 2014 ఎన్నికల్లో ప్రతి డ్వాక్రా మహిళ రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి.. చివరకు పదివేలు చేతిలో పెట్టి చేతులు దులుపుకున్నారు. ఆనాడు చంద్రబాబు మాటలు విని అప్పులు కట్టకుండా ఉండిపోయి డీఫాల్టర్లు అయ్యారు. చివరకు వడ్డీలకు చక్ర వడ్డీల లెక్కన అప్పులు కట్టారు.



నాలుగుసార్లు అధికారంలో ఉండి..

టీడీపీ ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వచ్చింది. గతంలో పద్నాలుగేళ్లుగా.. తాజాగా పది నెలలుగా ఎంత మంది మహిళలను పారిశ్రామివేత్తలుగా నిలబెట్టిందో ఈ ప్రభుత్వం చెప్పగలదా?. అధికారం కోసం అమాయక డ్వాక్రా మహిళలను ఆశల పల్లకీల్లో ఊగిసలాడించి పబ్బం గడుపుకోవడం టీడీపీ నైజంగా మారింది. నాలుగు దశాబ్దాల కిందటి నుంచి డ్వాక్రా గ్రూపులు ఏర్పాటవుతున్నాయి. లక్షలాది మంది మహిళలు ఆయా గ్రూపుల్లో సభ్యులుగా ఉండి ప్రభుత్వం నుంచి రుణ సాయం పొందుతున్నారు. కొన్ని గ్రూపుల వారు చిన్న చిన్న వ్యాపారాలు కూడా చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ ఎంత మంది డ్వాక్రా మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు అని ఎవరైనా ప్రశ్నిస్తే జవాబు చెప్పడం కష్టమే. ఎందుకంటే ప్రభుత్వ లక్ష్యం సరే.. ఆచరణే కార్యరూపం దాల్చడం లేదు. పొదుపు గ్రూపుల పర్యవేక్షకులు లంచాల దోపిడీతో మహిళలు అనుకున్న స్థాయిలో ఆర్థిక ప్రగతి సాధించలేపోయారనేది జగద్విదితమే.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే ఆర్థిక స్వావలంబన

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా గ్రూపుల్లోని మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశారు. ఎంతో మంది మహిళలు కుటీర పరిశ్రమల నుంచి చిన్న వ్యాపారులుగా స్వయం ఉపాధిలో ఎదిగారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపుల మహిళ రుణాలను మాఫీ చేసి నాలుగు దఫాలుగా చెల్లించారు. ఈ డబ్బులతోపాటు వైఎస్సార్ చేయూత పథకం, డ్వాక్రా రుణాలు కల్పించి ఈ మొత్తాలకు బ్యాంక్‌ల ద్వారా అదనపు రుణాలు అందించి వారి ఆర్థిక ప్రగతి బాటలు వేశారు. నగరాలు, పట్టణాల్లో డ్వాకా గ్రూపులను సమీకృతం చేసి వారితో సూపర్ మార్టులు ఏర్పాటు చేయించి మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కావలి, వింజమూరు, కందుకూరుల్లోని డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసిన మార్టులు మూతపడ్డాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ కూటమి ప్రభుత్వం మహిళలను ఏ విధంగా అభివృద్ధి చేస్తోందో తేటతెల్లమవుతోంది.

మంత్రి ప్రకటనపై విస్మయం

అయితే పాలకులు మాత్రం పొదుపు గ్రూపుల్లో ఉన్న పేద మహిళలను పారిశ్రామికవేత్తలను చేస్తామని ప్రకటిస్తుండటం విస్మయ పరుస్తోంది. వాస్తవంగా పొదుపు గ్రూపులో ఉన్న మహిళలు పొదుపు సంఘాలు ద్వారా సమకూరుతున్న అరకొర నగదుతో కొత్తగా వ్యాపారాలు చేయడానికి సాధ్యపడటం లేదు. అప్పటికే కుటుంబం చిరు వ్యాపారాలు, చిరు అమ్మకాలు చేస్తుంటే పొదుపు సంఘాలు ద్వారా వచ్చే నగదును అందులో పెట్టుబడిగా పెట్టుకుంటున్నారు. అలా చేస్తున్న వారినే అధికారులు కూడా పొదుపు మహిళలు ఉపాధి పొందుతున్నారంటూ ఊదరగొడుతున్నారు. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు కుటుంబానికి స్థోమత ఉంటే గృహిణులుగా స్థిరపడుతున్నారు. కుటుంబానికి స్థోమత లేకపోతే కుటుంబ పోషణ కోసం కూలీలుగా పనులకు కూడా పోతున్నారు.

పనికి పోతేనే ఇల్లు జరిగేది



మాది పేద కుటుంబం. అందరూ ఏదో ఒక పని చేసుకుంటేనే ఇల్లు జరుగుబాటు ఉంటుంది. పొదుపు సంఘంలో 20 ఏళ్లుగా ఉంటున్నా. పొదుపు ద్వారా కుటుంబం జరుగుబాటు కావడానికి ఎలాంటి జీవనో పాధి సమకూరలేదు. అందుకే బతకడానికి కూలి పనులు చేసుకుంటున్నాను.

– పొనబోయిన శేషమ్మ, అమ్మవారిపాళెం, గుడ్లూరు మండలం

కూలి పనులకు పోతుంటా

నేను 25 ఏళ్ల నుంచి పొదుపు గ్రూపులో ఉన్నా. పొదుపు సంఘం ద్వారా నాకు జీవనోపాధి ఏమీ కలగలేదు. కొద్దిగా డబ్బు చేతికందితే అరకొర ఖర్చులకు సరిపోతోంది. మళ్లీ రుణం చెల్లించాలి కాబట్టి కుటుంబ పోషణకు కూలి పనులకు పోతుంటాను.

– ఏకుల రమణమ్మ, పొదుపు మహిళ, అల్లూరు మండలం

కష్టం చేసుకొని బతకాలి

కష్టం చేసి బతుకుతున్నా. పొదుపు గ్రూపులో 16 సంవత్సరాలు నుంచి ఉన్నా. పొదుపు సంఘం ద్వారా బతకడానికి ఎలాంటి అవకాశాలు రాలేదు. ఎక్కడ కూలి పనులు దొరికితే అక్కడికి వెళ్లి కూలి పనులు చేస్తాను. అలా చేసుకుంటేనే ఇల్లు జరుగుతుంది.

– మనెమ్మ, పొదుపు మహిళ, చింతగుంట, అల్లూరు మండలం

పాతికేళ్లుగా టీడీపీ ఇదే చెబుతోంది



పొదుపు మహిళలను పారిశ్రామిక వేత్తలను చేస్తానని టీడీపీ పాతికేళ్లుగా ఇదే చెబుతోంది. పొదుపు చేసుకుని ప్రభుత్వం ఇచ్చే వెసులుబాటుతో పేద వర్గాల మహిళలు ఆర్థికంగా కొద్దిగా ఎదగడానికి మాత్రమే ఉపయోగపడు తుంది. అంతేకాని పొదుపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కాదు.

– సి.శారద, సామాజిక కార్యకర్త, కావలి



ధాన్యం ఆరబోసే పనిలో కూలీలుగా పొదుపు మహిళలు



పొదుపు గ్రూపు మహిళల సమావేశం

- అక్రమ మైనింగ్‌కు సహకరించారని తాజాగా కేసు
- ఇప్పటికే 16 విచారణలు.. 8 కేసులు
- అవినీతి జరగలేదని తేల్చి చెప్పిన విజిలెన్స్
- అయినా సిట్ వేసి అక్రమ కేసులతో వేధింపులు
- నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో అరెస్ట్‌కు రంగం సిద్ధం
- ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదంటున్న కాకాణి

కూటమి టార్గెట్ కాకాణి

నెల్లూరు పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతను ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రెడ్‌బుక్ కుట్రలో భాగంగా జైలుకు పంపేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. పొదలకూరు మండలం తాటిపర్తిలోని 'రుస్తుం మైన్స్‌లో' అక్రమ మైనింగ్ జరిగిందంటూ అందులో కాకాణి అనుచరుల ప్రమేయం ఉందని, వారికి ఆయన సహకరించారంటూ నాన్ బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలోనే స్థానిక ఎమ్మెల్యే చేసిన ఆరోపణలతో చేపట్టిన విజిలెన్స్ విచారణలో అసలు అక్కడ మైనింగే జరగలేదంటూ నివేదిక ఇచ్చినా.. తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేస్తున్నారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసింది. ఆ పార్టీ వైఫల్యాలను, తప్పుడు ప్రచారాలను, అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ఆయన్ను కట్టడి చేయాలని ఉద్దేశంతో తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేస్తోంది.

కాకాణిపై ఎప్పుడెప్పుడు కేసులు

- గతేడాది గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెడితే ఆ వార్తను 'సాక్షి' కవర్ చేసింది. ఆ పేపర్ కటింగ్‌ను తన వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశాడని వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.
- వెంకటాచలం మండలానికి చెందిన బీజేపీ నేత నెల్లూరులో ప్రెస్‌మీట్ పెడితే ఆ వీడియో కాకాణి వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశాడని మరో కేసు పెట్టారు.
- స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అసభ్యకరంగా పోస్టింగ్ పెట్టాడని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించారు.
- గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయకపోవడంతో భవన కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి వారికి సంఘీభావంగా వెళ్లి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నందుకు ఆయనపై కేసు నమోదు చేశారు.
- గతేడాది డిసెంబర్‌లో వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ శేషయ్యపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. పోలీసుల తీరుపై కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై వెంకటాచలానికి చెందిన టీడీపీ కార్యకర్త నెల్లూరు వేదాయపాళెం పోలీసులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారు.
- కావలి నియోజకవర్గంలోని బోగోలు మండలం కోళ్లదిన్నెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయి. గాయపడిన వారిని పరామర్శించిన కాకాణి అక్కడ మీడియాతో మాట్లాడుతూ పోలీసుల పక్షపాత వైఖరిని ఎండగట్టి తప్పు చేసిన అధికారులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు తనకు బాధ కలిగించిందని టీడీపీ కార్యకర్త కావలి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- తాజాగా పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్స్‌లో గత ప్రభుత్వ హయాంలో అనధికారికంగా మైనింగ్ చేసి క్వార్ట్జ్ మెటల్‌ను తరలించారని, అందుకు కాకాణి తన అనుచరులకు సహకరించారనే కారణం చూపి ఆయనపై కేసు నమోదు చేశారు. కాగా ఈ కేసులో ఇద్దరిని ఇప్పటికే అరెస్ట్ చేసిన నేపథ్యంలో వారి రిమాండ్ రిపోర్టులో ఎక్కడా కూడా కాకాణి పాత్ర ఉన్నట్లు ధ్రువపరచలేదు. తాము ఆయన అనుచరులమని, మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులను మేనేజ్ చేస్తామని చెప్పడంతోనే అక్రమ మైనింగ్ చేసినట్లు చూపి నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఇదంతా కూడా పోలీసుల కల్పితమే కానీ, ఎక్కడా వీరి పాత్ర కానీ, కాకాణి పాత్ర ఎక్కడా లేకపోవడం గమనార్హం.

కేసులకు భయపడేది లేదు

తాను కేసులకు భయపడి ప్రశ్నించే విధానాన్ని మాత్రం మానుకోను. ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం ఎండగడుతూనే ఉంటా. కూటమి ప్రభుత్వ ఏర్పాటయ్యాక ఇప్పటి వరకు 8 కేసులు నమోదు చేశారు. క్వార్ట్జ్ కేసులో నన్ను ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారు. నన్ను ఎన్నిసార్లు అరెస్ట్ చేసినా ప్రభుత్వ వైఫల్యాలను మాత్రం ప్రశ్నిస్తూనే ఉంటా. సర్వేపల్లిలో ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతిని బయట పెడుతూనే ఉంటా. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించను. మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో మా పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటాం. అందుకే ఎన్ని కేసులు నమోదైనా జంకే ప్రసక్తేలేదు.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి

ఎవరో ఫిర్యాదు ఇస్తే కేసులా?

మాజీ మంత్రి కాకాణి ప్రతి నిత్యం ప్రభుత్వ వైఫల్యాలపైన, సర్వేపల్లిలో జరిగే అవినీతి, అక్రమాలను ఎండ గడుతున్నారు. ఇది రుచించని ప్రభుత్వ పెద్దలతోపాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి తమ అనుచర వర్గాలతో ఫిర్యాదులు చేయిస్తూ కేసులు నమోదు చేయిస్తున్నారు. వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా పోలీసులు సైతం ఫిర్యాదు వచ్చిందే తడవుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఏ కేసులో కూడా బాధిత వర్గాలు ఫిర్యాదులు చేయలేదు. టీడీపీ కార్యకర్తలు ఇచ్చే ఫిర్యాదే ప్రామాణికంగా తీసుకుని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు.

ఇప్పటి వరకు 16 విచారణలు

గత ప్రభుత్వ హయాంలో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు విజిలెన్స్ విచారణలు చేయించారు. ఇప్పటికి 16 పర్యాయాలు విజిలెన్స్ అధికారులు విచారణ చేసి అవినీతి జరగలేదని తేల్చి చెప్పారు. దీంతో ఎలాగైనా కాకాణిని జైలుకు పంపేలా ప్రభుత్వ పెద్దలు చేయని ప్రయత్నాలు లేవు. తాజాగా ఒంగోలుకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేసి విచారణలు చేస్తున్నారు.



కాకాణి ఇంటి వద్దకు నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (పొగతోట): మాజీమంత్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంటి వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా మోహరించారు. పార్టీ జిల్లా కార్యాలయం కాకాణి నివాసానికి సమీపంలో ఉండడంతో కార్యాలయం చుట్టూ, కాకాణి ఇంటి చుట్టూ పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీలోని రుస్తుం మైన్‌లో గత ప్రభుత్వంలో అక్రమంగా తెల్ల రాయిని తరలించారని ఫిబ్రవరిలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో కాకాణిని ఏ–4గా చేర్చారు. ఈ కేసుకు సంబంధించి కాకాణిని అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. పోలీసులు మఫ్టీలో తిరుగుతూ కాకాణి నివాసం వద్ద పరిస్థితిని తెలుసుకుంటున్నారు.

‘మత్తు’ దందా



భరించలేని దీర్ఘకాలిక నొప్పులు, కేన్సర్ చివరిదశ, కొన్ని రకాల ఆపరేషన్లు, తీవ్రమైన మానసిక ఒత్తిడి తదితర సమస్యలున్నప్పుడు డాక్టర్లు పరిశీలించి ఉపశమనం కలిగించేందుకు తాత్కాలికంగా, పరిమితంగా కొన్ని రకాల మత్తు మాత్రలు రాస్తారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికి మాత్రమే లైసెన్స్ పొందిన మందుల దుకాణాలు వాటిని అమ్మాలి. అయితే జిల్లాలో పరిస్థితి మరోలా ఉంది. వైద్యుడి చీటీతో సంబంధం లేకుండా.. బిల్లులు ఇవ్వకుండానే ఇష్టారాజ్యంగా మత్తు మాత్రలు అమ్ముతున్నారు.



నెల్లూరు(అర్బన్): జిల్లాలో రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులు సుమారు 2 వేల వరకు ఉన్నాయి. గత వారం జిల్లా ఔషధ నియంత్రణ, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా పోలీసుల సహకారంతో నెల్లూరు నగరం, ఆత్మకూరు పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న మందులు, విక్రయాలు జరిగిన మందుల గురించి క్షుణ్ణంగా పరిశీలించారు. నాలుగు షాపుల్లో విక్రయాల తాలూకా బిల్లుల్లేవు. మత్తు మాత్రలకు సంబంధించి ఉండాల్సిన స్టాక్, అమ్మిన మందులకు బిల్లుల్లో తేడాలొచ్చాయి. దీంతో అధికారులు ప్రశ్నించగా దుకాణాల వారు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. బిల్లుల్లేకుండా మత్తు మాత్రలు అమ్మిన షాపులకు నోటీసులిచ్చేందుకు అధికారులు పూనుకున్నారు.

ఏం చేయాలంటే..

కొన్ని షాపుల వారు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే అడిగిన వారికి మత్తు మాత్రలు అమ్ముతున్నట్టు తనిఖీల్లో తేలింది. వాస్తవానికి మత్తుమాత్రలు అమ్మితే వైద్యుడి చీటీ జెరాక్స్ తీసుకుని భద్రపరచాలి. అయితే అలాంటిది జరగడం లేదు. మార్కెట్లో సులభంగా మత్తు మాత్రలు దొరుకుతుండటంతో యువత ఒత్తిడిని తగ్గించుకుని నిద్ర పోయేందుకు యథేచ్ఛగా కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తోంది. మొదట్లో ఒకటి, రెండు దఫాలు టెన్షన్ తగ్గించుకుని నిద్రపోయేందుకు మాత్రలు వాడిన వారు క్రమేణా వాటికి బానిసలు అవుతున్నారనే విమర్శలున్నాయి. ఈ కోణంలోనే కొంతమంది నిద్ర మాత్రలు అతిగా మింగి ప్రాణం మీదకు తెచ్చుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. మరికొంతమంది ప్రాణాలను తీసుకునేందుకు వినియోగిస్తున్నారు.

మాత్రలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కొన్ని మందుల్ని పరిశీలిస్తే..

డైజీపామ్ (వాలియం), ఆల్ప్రాజోలం, బుటాబార్బిటాల్, జోల్పిడెమ్, క్లోనాజెపామ్, టెమాజెపామ్, రెస్టిల్, జోల్రెష్ లాంటి పలు రకాల మాత్రలు మత్తును కలిగిస్తాయి. దీంతో నిద్రలోకి జారుకుంటారు. అయినా టెన్షన్ తగ్గకపోతే మిడజోలం లాంటి ఇంజెక్షన్‌ను నేరుగా నరానికి (ఇంట్రావీన్) ఎక్కిస్తారు. దీంతో తక్షణమే నిద్రలోకి వెళ్తారు. ఇలాంటి ఇంజెక్షన్లు కూడా కొన్ని చోట్ల అమ్ముతున్నట్టు తెలుస్తోంది.

ఒక్కో దఫా ప్రాణాంతకం

ఉద్యోగ ఒత్తిడితోనో.. ఆర్థిక సమస్యలో.. నిద్రపట్టక ఇబ్బంది పడుతున్న పలువురు డాక్టర్ చీటీతో సంబంధం లేకుండానే స్లీపింగ్ టాబ్లెట్స్ కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో దఫా ఎక్కువగా వేసుకుంటున్నారు. మోతాదుకి మించితే ఆ మాత్రలు ప్రాణాంతకంగా మారతాయి. వీటి జోలికి వెళ్లకూడదని డాక్టర్లు పేర్కొంటున్నారు.



నోటీసులిస్తున్నాం

కొన్ని మెడికల్ షాపుల వారు బిల్లుల్లేకుండా అడిగిన వారికి మత్తు మాత్రలు అమ్మినట్టు తనిఖీల్లో వెల్లడైంది. అలాంటి వారికి నోటీసులిస్తున్నాం. కొన్నిరోజులు షాపులను కూడా మూసివేయించేందుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో ఎవరైనా మెడికల్ షాపుల వారు డాక్టర్ ప్రిస్క్రిప్షన్, బిల్లులు లేకుండా మత్తు మాత్రలు అమ్మితే కేసులు నమోదు చేస్తాం.

– ఒ.వీరకుమార్‌రెడ్డి, ఏడీ, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ

తనిఖీలు అంతంతమాత్రమే..

జిల్లా ఔషధ నియంత్రణ శాఖలో సిబ్బంది తక్కువగా ఉండటం, కోర్టు కేసులు ఎక్కువగా ఉండటంతో అధికారులు తనిఖీలను నామమాత్రంగానే చేస్తున్నారు. 2023లోనూ ఇదే తరహాలో తనిఖీలు చేయగా అప్పట్లో కూడా వేదాయపాళెంలోని ఓ మెడికల్ షాపు యజమానిపై, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మరో మెడికల్ షాపు యజమానిపై కేసులు నమోదు చేశారు. తర్వాత ఇలా టీంలుగా సర్వే చేయలేదు. సరైన తనిఖీలు లేనందువల్ల మెడికల్ షాపుల వారు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిరంతర తనిఖీలు చేపట్టాల్సిన అవసరముంది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): బాత్‌రూమ్‌లో జారిపడి గాయాలపాలైన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు శెట్టిగుంటరోడ్డులో కె.కోటేశ్వరరావు (65) కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. సోమవారం తన ఇంట్లోని బాత్‌రూమ్‌లో జారిపడి గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి కోటేశ్వరరావు మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివ మంగళవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 44 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జేసీ కె.కార్తీక్ తెలిపారు. మంగళవారం 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లుగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు రూ.96.61 కోట్లను రైతులకు చెల్లించినట్లు తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.75
సన్నవి : రూ.55
పండ్లు : రూ.30

క్లుప్తంగా

28, 29 తేదీల్లో అభ్యర్థులకు పరీక్ష

నెల్లూరు(టౌన్): కస్తూరిదేవి ఎయిడెడ్ బాలికల హైస్కూల్, శ్రీపొట్టి శ్రీరాములు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 28, 29 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని కస్తూరిదేవి బాలికల హైస్కూల్లో ఎస్‌ఏ మ్యాథ్స్ – 2, ఎస్‌ఏ బీఎస్ – 1, ఎస్‌ఏ పీఎస్ – 1, ఎస్జీటీ – 2, ఎస్‌ఏ హిందీ – 1, గూడూరులోని శ్రీపొట్టి శ్రీరాములు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ – 1, ఎల్‌పీ హిందీ – 1, ఎల్‌పీ తెలుగు – 1 పోస్టులు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను https://cse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పాఠశాల యాజమాన్యాలకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇచ్చిన వారు తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పిస్తే జిల్లా విద్యాశాఖ వారు హాల్‌టికెట్ జారీ చేస్తారన్నారు.

నెల్లూరులో ఆర్పీఎఫ్ ఐజీ



అధికారులతో మాట్లాడుతున్న ఐజీ

నెల్లూరు(క్రైమ్): వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమా సింగ్ నెల్లూరు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. స్థానిక ఆర్పీఎఫ్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఆమె సిబ్బందికి సూచించారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ట్రాక్టర్ ట్రక్కు కింద సేద తీరుతుండగా..

• ఒక్కసారిగా వాహనం తీసిన డ్రైవర్
• ఓ మహిళ మృతి, మరొకరికి గాయాలు



ప్రమీలమ్మ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: ఆ మహిళలు ట్రాక్టర్ ట్రక్కు కింద సేద తీరుతున్నారు. దీనిని గుర్తించకుండా ఒక్కసారిగా వాహనాన్ని డ్రైవర్ తీశాడు. దీంతో ఒక మహిళ మృతిచెందగా.. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాళెం మండల పరిధిలోని పంచేడు గ్రామానికి చెందిన పొలాల్లో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. భాస్కర్ అనే వ్యక్తి తన పొలంలో మెషీన్ ద్వారా వరికోతలు చేయిస్తున్నాడు. ధాన్యాన్ని మెషీన్ వద్ద నుంచి బాటపైకి తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌ను కొద్దిసేపు డ్రైవర్ పక్కన నిలిపాడు. గెనాలకు గడ్డి కోసేందుకు నాగూరు ప్రమీలమ్మ (48), మరో మహిళ వచ్చారు. ఎండ అధికంగా ఉండటంతో వీరు సేద తీరేందుకు ట్రాక్టర్ ట్రక్కు కింద కూర్చొన్నారు. ఈ సమయంలో వరికోత మెషీన్ ఆపరేటర్ ట్రాక్టర్ డ్రైవర్‌ను పిలిచి వాహనాన్ని తీసుకురమ్మన్నాడు. డ్రైవర్ ట్రాక్టర్‌ను తిప్పే క్రమంలో మహిళలను గుర్తించకుండా వారిపైకి ఎక్కించి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ప్రమీలమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మరో మహిళ గాయపడి పెద్దగా కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి ఆమెను బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అనికేపల్లిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అనికేపల్లి గ్రామానికి చెందిన వాసిలి కొండస్వామి (46)కి భార్య వెంకట సురేఖ, ఒక కుమారుడు ఉన్నారు. కొండస్వామి మద్యానికి బానిసయ్యాడు. అతను కుటుంబాన్ని పట్టించుకోలేదు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య విభేదాలు నెలకొన్నాయి. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కొండస్వామి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన సభ్యులు

నెల్లూరు(పొగతోట): పశు సంవర్ధక శాఖ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మంగళవారం నెల్లూరులో కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఐ.కృష్ణమౌర్య, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ డి.మాధవిలత, ఉపాధ్యక్షులుగా మాలకొండయ్య, శశిధర్, సంయుక్త కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ జె.చైతన్య కిశోర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ బి.మురళీకృష్ణ, డాక్టర్ జె.యశోధ, డాక్టర్ బి.సురేష్, డాక్టర్ కె.సురేష్, డాక్టర్ వైపీ కామేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ లక్ష్మీశైలజ వ్యవహరిస్తారు.

మంత్రా.. మజాకా

• టెన్త్ ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్
• 10 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన ఆర్జేడీ
• విచారణ పూర్తి కాకుండానే సస్పెన్షన్ల రద్దు
• నాలుగురోజులు తిరగకుండానే వారికి ఆర్డర్లు
• జిల్లా మంత్రి ఒత్తిడితోనే విధుల్లోకి..
• రూ.లక్షల్లో చేతులు మారాయన్న ఆరోపణలు

నెల్లూరు(టౌన్): అధికార బలాన్ని దుర్వినియోగం చేస్తూ.. పరీక్షలను అపహాస్యం చేస్తూ ఓ మంత్రి చక్రం తిప్పిన వైనాన్ని అన్ని వర్గాలు అసహ్యించుకుంటున్నాయి. ఎంత తప్పు చేసినా దర్జాగా మళ్లీ పోస్టింగ్ తెచ్చుకోవచ్చని జిల్లా విద్యాశాఖలో కొందరు ఉపాధ్యాయులు నిరూపించారు. సస్పెండ్ వ్యవహారం విచారణలో ఉండగానే రాష్ట్ర విద్యాశాఖా మంత్రికి సన్నిహితంగా ఉండే జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆ శాఖ అధికారులు మీద ఒత్తిళ్లు తెచ్చి వారి సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ, తిరిగి పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పనిలో పనిగా విద్యాశాఖలో జోనల్ అధికారితోపాటు జిల్లా విద్యాశాఖాధికారి సైతం భారీ మొత్తంలో ముడుపులు పుచ్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగిందంటే..

ఈనెల 17వ తేదీ నుంచి ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 19న విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి కందుకూరులో జరుగుతున్న ఓపెన్ పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్పుడు పరీక్షలను ఒకరికి బదులు మరొకరు రాస్తుండటం, పుస్తకాలు పెట్టుకుని పరీక్ష రాస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కందుకూరులోని చైతన్య స్కూల్, టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లుగా ఉన్న ఆరుగురు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని డీఈఓ బాలాజీరావును ఆదేశించారు. దీంతో డీఈఓ పదిమంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు అభ్యాసకులను డిబార్ చేశారు. ఆ మరుసటిరోజు ఓపెన్ స్కూల్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై మిమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేయకూడదో చెప్పాలంటూ డీఈఓ నోటీసులు జారీ చేశారు. మాస్ కాపీయింగ్‌పై అక్కడి డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలను విచారణ అధికారులుగా నియమించారు. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

మంత్రి ఒత్తిడి

విధులు నిర్లక్ష్యంగా నిర్వహించారన్న కారణంతో సస్పెండ్ చేసిన 10 మంది ఉపాధ్యాయులను నాలుగు రోజులు తిరగకుండానే సస్పెన్షన్‌ను రద్దు చేసి మళ్లీ విధుల్లోకి తీసుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా తప్పు జరిగి సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను కనీసం మూడునెలలపాటు పనిష్మెంట్ ఇస్తారు. విచారణ పూర్తయ్యాక సస్పెన్షన్‌ను రద్దు చేసి వారిని విధుల్లోకి తీసుకుంటారు. అయితే సాక్షాత్తు ఆర్జేడీ సమక్షంలోనే మాస్ కాపీయింగ్ జరుగుతుందని తేల్చి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని ఆదేశిస్తే నాలుగు రోజులు కూడా తిరగకుండా వారికి పోస్టింగ్ ఇవ్వడంపై పలువురు తప్పు పడుతున్నారు. జిల్లాకు చెందిన ఓ మంత్రి ఒత్తిడి, పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారడంతోనే సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ సోమవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేతపై డీఈఓ బాలాజీరావును సంప్రదించగా విచారణ పెండింగ్‌లో ఉందని, అవసరాల రీత్యా వారిని విధుల్లోకి తీసుకున్నట్లు చెప్పారు.

వీఎస్‌యూలో అంతర్జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో బ్లూ రెవల్యూషన్ ఇన్నోవేషన్స్ ఇన్ మెరైన్ సిస్టమ్స్ (బీఆర్‌ఐఎంఎస్ – 2025) అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్లూ ఎకానమీ అభివృద్ధికి దోహదం చేసే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సముద్ర పరిశోధన, మత్స్య పరిశ్రమ, బ్లూ ఎకానమీ అభివృద్ధిలో విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం అవసరమని తెలియజేశారు. ఇంటర్నేషనల్ ఎక్స్‌పర్ట్ ఇన్ బ్లూ ఎకానమీ, ఎక్స్‌పర్‌లైజ్ ఫ్రాన్స్ ప్రొఫెసర్ మానెల్ జఖారియా, ఎన్‌ఐఓటీ సభ్యుడు డాక్టర్ ఎన్‌వీ వినీత్‌కుమార్ తదితరులు సముద్ర సంపదను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా బ్లూ ఎకానమీ అభివృద్ధికి కొత్త అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేస్తాం

• సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



వీరేపల్లిలో సభకు హాజరైన సబ్ కలెక్టర్

ఉలవపాడు: గిరిజనులకు సాగుబడి హక్కులు కల్పించడంలో చట్టప్రకారం న్యాయం చేస్తామని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వీరేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. భూములపై గిరిజనులకు సాగుబడి హక్కు కల్పించడానికి అటవీ శాఖ, ఎస్టీ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2005 గిరిజన చట్టానికి ముందు నుంచి అటవీ భూములు సాగు చేసుకుంటున్నారా? లేక తర్వాత చేపట్టారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పంటలు వేస్తున్నారని వారిని అడిగారు. వీరేపల్లి పరిధిలో 74 మందిని అర్హులుగా గుర్తించినట్లు ఆమెకు రెవెన్యూ సిబ్బంది తెలియజేశారు. మిగిలిన వారు తమ సాగుబడి గురించి ఆమెకు వినతిపత్రాలు అందించారు. వీరేపల్లి చెరువులో నీరు తాగి గొర్రెలు చనిపోయాయని కొందరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, తాగునీటికి పనికిరావని దండోరా వేశారని గ్రామ మాజీ సర్పంచ్ నన్నం పోతురాజు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఐటీడీఏ, అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనండి మహాప్రభో..



ధాన్యాన్ని చూపుతున్న రైతు విజయ్‌కుమార్

పొదలకూరు: రోజూ ఇంత మొత్తంలో ధాన్యం కొనుగోలు చేశామని అధికారులు ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. ఇందుకు ఈ రైతు పడుతున్న ఆవేదనే ఉదాహరణ. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన రైతు అరెడ్డుల విజయ్‌కుమార్ రబీలో 10.30 ఎకరాల్లో బీపీటీ 5204 రకం వరిసాగు చేపట్టాడు. కోతల అనంతరం ధాన్యాన్ని కల్లాల వద్ద ఆరబెట్టాడు. తాటిపర్తి కేంద్రం వద్దకు వెళ్లి కొనుగోలు చేయాల్సిందిగా కోరాడు. గోతాలు లేవని, ట్రక్ షీట్ ఇచ్చేందుకు మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ లేదని అక్కడి వారు సాకులు చెబుతున్నారని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆరబెట్టిన ధాన్యాన్ని ఎక్కువ రోజులు ఉంచుకుంటే ధరలు పతనమవుతాయని నేరుగా నెల్లూరుకు సమీపంలోని శ్రీలక్ష్మి రైస్‌మిల్లు వద్దకు వెళ్లాడు. వారు తేమ శాతం సమస్య చెప్పి తీసుకోవడం కుదరదని వెల్లడించారు. దీంతో దిక్కుతోచక రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. అటు దళారులకు అమ్ముకోలేక, ఇటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించలేక ఇబ్బందులు పడుతున్నాడు. అకాల వర్షం వస్తే ధాన్యాన్ని దాచుకునే వీలు కూడా లేదని ఆవేదన చెందుతున్నాడు. జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఉంటే కూటమి ప్రభుత్వం మాత్రం అంతా బాగుందని చెప్పుకొంటోంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తామని ఆ సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎస్.సుబ్బరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు పదో తరగతి లేదా ఐటీఐ, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శిక్షణకు ఇంటర్ లేదా డిగ్రీ , జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్‌కు ఇంటర్, బ్యూటీ థెరపీకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలియజేశారు. అదనంగా బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 90630 82227, 99664 48807 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లైంగికదాడి కేసులో ఒకరికి జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్): బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో కోట మండలం గోవిందపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాసులు (34)కు జీవిత ఖైదు, రూ.23,000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఓ దంపతులు కోట మండలంలోని గోవిందపల్లి గ్రామంలో ఉంటూ పనులకు వెళ్తున్నారు. వారి కుమార్తె స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆరో తరగతి చదువుతుండేది. 2023 ఏప్రిల్ 18వ తేదీన ఉదయం బడికి వెళ్లకుండా ఇంటికి సమీపంలో సరదాగా చేపలు పట్టడానికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు బాలికను తీసుకెళ్లి బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో అతను పారిపోయాడు. ఆమె ఇంటికెళ్లి తల్లికి ఈ విషయం చెప్పింది. అదేరోజు ఫిర్యాదు అందుకున్న కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం శ్రీనివాసులుపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ చంద్రశేఖర్ వాదించారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
బుధవారం ॥ 26-3-2025



స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు.
అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు.
కొచ్చి, పూణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది.
సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు.
స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్
తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు.
రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...

లేడీ బౌన్సర్స్‌కు
అడ్డే లేదు

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పూణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు ఆకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.


కృష్ణకుమారి

వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
వంట గెలిచింది

కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. "మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి." అన్నారు కృష్ణకుమారి.



మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయపథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

చిన్న రైతులే





నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్



మొటిమలు, మచ్చలు పోవాలంటే...



ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

లీగల్

పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు "నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది" కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్టు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సిలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్లైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోసపూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్లి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం
sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేవాపథం

పేదోళ్ల వకీలమ్మ


సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత తను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.

సామాజిక సేవే... విలువైన సంపద

న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.

– సరళ మహేందర్‌రెడ్డి

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.



రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండుసార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి,
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

గ్లోబల్ టు లోకల్


జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!

విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి. ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.

'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను



గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.

● ఆర్ట్ అండ్ కల్చర్

పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్థాన్‌లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్శిటీ (జీసీయూ) విద్యార్థుల బృందం ఈ


'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం

ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!